న్యాయ పూర్తి వివరణ

న్యాయ పరిధి : మహిళా చట్టాలు
సెక్షన్ పరిధి : హిందూ వివాహ చట్టం
ఉప సెక్షన్ పరిధి : విడాకులు

## సంక్షిప్తంగా న్యాయ సమాచారం

'విడాకులు' అంటే భార్యా భర్తలు తమ మధ్య ఏర్పడిన వివాహ బంధాన్ని చట్టం ద్వారా రద్దు చేసుకోవడం.

## విపులంగా న్యాయ వివరాలు

జుడీషియల్ సెపరేషన్ : - జుడీషియల్ సెపరేషన్ అంటే కోర్టువారి అనుమతితో భార్యా భర్తలు విడిగా ఉండే హక్కు పొందడం. అయితే దీని వల్ల వివాహ బంధం రద్దు కాదు. కేవలం విడిగా ఉండే అవకాశం మాత్రమే ఈ సెక్షను కల్పిస్తుంది.
ఐతే విడాకులు పొందడానికి చూపించే కారణాలే జుడీషియల్ సెపరేషన్‌కు కూడా చూపించాలి.
పరస్పర అంగీకారంతో విడాకులు : వివాహానంతరం భార్యా భర్తల మధ్య ప్రేమాభిమానాలు లోపించి సఖ్యత కుదరకపోతే వారు పరస్పర అంగీకారంతో విడిపోవచ్చు. ఈ అవకాశం హిందూ వివాహ చట్టంలోని 13 B సెక్షను కల్పిస్తోంది. ప్రత్యేక కారణాలేమి చూపించనవసరము లేదు.
సదరు జిల్లా కోర్టులో విడాకుల పిటిషను దాఖలు చేయాలి. కోర్టు ఈ క్రింది విషయాలను పరిగణిస్తుంది.

- భార్యా భర్తలిరువురు గత ఏడాది నుండి విడిగా ఉంటున్నారు.
- వారు పరస్పర అంగీకారముతో విడిపోవడానికి ఒప్పుకున్నారు.
- వారి నిర్ణయానికి ఎవరి బలవంతము లేదు

పరస్పర అంగీకారంతో విడాకులు పొందడానికి వచ్చిన దరఖాస్తు పై కోర్టువారు ఆరు నెలలు పాటు ఎటువంటి చర్య తీసుకోరు. దరఖాస్తు అందిన 6 నెలల తర్వాత, 18

నెలల ముందు కోర్టు విడాకుల డిక్రీని జారీ చేస్తుంది. అయితే ఈ లోపు కక్షిదారులు దరఖాస్తును ఉపసంహరించుకోవచ్చు.
ఒకవేళ దరఖాస్తు వేసిన తర్వాత ఒక కక్షిదారు తన అంగీకారమును ఉపసంహరించుకున్న పక్షంలో, కోర్టు కారణాలను విచారిస్తుంది. విచారణ సమయంలో కక్షిదారు తన అంగీకారమును తెలుపకపోతే, ఈ సెక్షను కింద విడాకులు పొందే అవకాశము లేదు.

<u>విడాకులు</u> **:** హిందూ వివాహ చట్టం, 1955 లోని 13 సెక్షను ప్రకారం విడాకులు పొందడానికి ప్రధానంగా చూపించాల్సిన కారణాలు ఈ విధంగా ఉన్నాయి.

1. వివాహేతర సంబంధం
2. క్రూర ప్రవర్తన
3. రెండు సంవత్సరాలకు పైగా వదలి వెళ్ళియుండటం
4. మత మార్పిడి
5. నయంకాని విధంగా మతిస్థిమితం కోల్పోవడం
6. హానికర లేదా నయంకాని రోగాలతో బాధపడటం
7. ఇతరులకు వ్యాపించే లైంగిక వ్యాధితో బాధపడటం
8. సన్యాసం స్వీకరించడం
9. ఏడు సంవత్సరాలపాటు ఎవరైనా కనిపించకుండా మాయమవడం

ఈ కారణాలతో పాటు చట్టం మహిళలకు మరికొన్ని కారణాలను అదనంగా ఇచ్చింది. అవి ఇలా ఉన్నాయి:

1. వివాహం జరిగిన తర్వాత భర్త అత్యాచారానికి (రేప్) పాల్పడి దోషిగా నిరూపితమైతే
2. నేర ప్రక్రియ స్మృతిలోని సెక్షను 125 కింద మెయింటెనెన్స్ డిక్రీ పొందినా లేదా 1956 నాటి హిందూ అడాప్షన్ మరియు మెయింటెనెన్స్ చట్టంలోని సెక్షన్ 18 కింద మెయింటెనెన్స్ పొందిన సంవత్సరం లోపల భార్యాభర్తల మధ్య సంబంధం పునరావృతం కాకున్నా

## పరిష్కార పద్ధతి

## సెక్షన్ పేరు

సెక్షన్ 10 : జుడిషియల్ సెపరేషన్

సెక్షన్ 13 : విడాకులు పొందడానికి కారణాలు

సెక్షన్ 13 బి : పరస్పర అంగీకారముతో విడాకులు పొందడం

## ఫిర్యాదు ఎవరికి ఇవ్వాలి / ఎక్కడ ఇవ్వాలి ?

ఈ క్రింది పరిధిలో ఉన్న సదరు జిల్లా కోర్టులో దావా వేయవచ్చు

a. వివాహము జరిగిన చోట
b. భార్యా భర్తలిద్దరు కలిసి నివసిస్తున్న చోట
c. భార్యా భర్తలిద్దరు ఇది వరకు కలిసి నివసించిన చోట.

## కేసు ఫైల్ చేయడం ఎలా ?

విడాకుల కోసం పిటిషను దాఖలు చేసే ముందు

- భార్యా భర్తలు వివాహానంతరం కనీసం ఒక ఏడాది అయినా కలిసి జీవించి ఉండాలి. లేని పక్షంలో విడాకులు పొందే అవకాశం లేదు.
- వివాహమైన వెంటనే లేదా వివాహమైన ఏడాదిలోపు విడాకుల కోసం పిటిషను దాఖలు చేసే వీలు లేదు.
- హిందూ మతాచారాల ప్రకారం పెళ్ళి జరిగి ఉండాలి. హిందూ వివాహంలో సప్తపది ముఖ్యమైన ఘట్టం అది తప్పకుండా ఉండాలి.

పిటిషనులో వివరాలన్నీ స్పష్టంగా తెలియ చేయాలి. ఎటువంటి పరిహారం కోరుతునా న్రో తెలియచేయాలి. కక్షిదారుల మధ్య ఎటువంటి లాలూచీ లేదని తెలపాలి. తాను ఇచ్చిన స్టేట్మెంటులోని వివరాలు నిజమైనవని పిటిషనరు ధృవపరచాలి.

పౌర ప్రక్రియ స్మృతి, 1908 ప్రకారం కేసు విచారణ జరుగుతుంది. ఒకవేళ కక్షిదారు కోరితే లేదా కోర్టువారు తలుస్తే, విచారణ రహస్యంగా జరుగుతుంది. రహస్యంగా

జరిగిన కోర్టు వ్యవహారాలను ప్రచురించినవారికి రూ. 1000 వరకు జరిమానా విధించబడవచ్చు.

పిటిషనరులు తన తప్పును కప్పివేయడానికి దావా వేయలేదని, విడాకుల ఇవ్వడానికి తగిన కారణాలు ఉన్నాయి అని కోర్టువారు సంతృప్తి చెందితే విడాకులు డిక్రీ ప్రదానం చేస్తారు.
ఐతే విడాకులు ప్రదానం చేసే ముందు భర్యా భర్తల మధ్య రాజీ కుదర్చడానికి కోర్టువారు తప్పకుండా ప్రయత్నిస్తారు. ఒకవేళ భర్యాభర్తలిద్దరిలో ఎవరికైనా ఆర్థిక సహాయం అవసరమైయుంటే, ప్రతిపక్ష దారునిచేత వారి కోర్టు ఖర్చులకు, నెలసరి ఖర్చులకు కోర్టువారు డబ్బు ఇప్పిస్తారు. శాశ్వత భరణం, మనోవర్తి పొందవచ్చు. పిల్లల కస్టడీ, పోషణ, చదువులకయ్యే ఖర్చులు మొదలైనవన్నిటి పై కూడా కోర్టువారు ఆదేశాలు జారీ చేస్తారు.
విడాకులు పొందిన తర్వాత, క్రింది కోర్టు డిక్రీ పై హైకోర్టుకు అప్పీలు చేయకపోతే, లేదా అప్పీలు చేసే సమయం దాటిపోతే లేదా అప్పీలును హైకోర్టు కొట్టివేసిన తర్వాత మాత్రమే పున: వివాహము చేసుకోవచ్చు. అంతకు ముందు రెండవ వివాహము చేసుకుంటే అది చెల్లదు. జుడిషియల్ సెపెరేషన్ ఆదేశము అమలులో ఉండగా, భార్యతో బలవంతపు లైంగిక సంపర్కము చేయుట భారత శిక్షాస్మృతి, సెక్షన్ 376 A కింద నేరము. అందుకు 2 ఏళ్ళ జైలుశిక్ష విధించబడవచ్చు.

## తరువాత

క్రింది కోర్టు డిక్రీ పై హైకోర్టుకు అప్పీలు చేయవచ్చు. ఆ పై సుప్రీం కోర్టు వరకు కూడా వెళ్ళవచ్చు.

## ప్రత్యామ్నాయ పరిష్కారం

ఒక మహిళ తన భర్త నుండి విడాకులు పొందదలిస్తే, తన స్నేహితుల, శ్రేయోభిలాషుల సహాయం పొందవచ్చు. భర్త విడాకులిమ్మని అమెని బలవంతం చేస్తే, వారి సహాయంతో పాటు స్వచ్ఛంద సంస్థల సహాయం తీసుకొని రాజీ కుదర్చడా నికి ప్రయత్నించవచ్చు.
న్యాయసేవా అధికార సంస్థల ద్వారా ఉచిత న్యాయసేవలను పొందవచ్చు.

కొన్ని కులాలు, తెగలలో గ్రామ పంచాయితీలే విడాకులు ప్రదానం చేస్తాయి. అలాంటప్పుడు కొన్ని విషయాలు తప్పకుండా గుర్తుంచుకోవాలి

- గ్రామ పంచాయితీ వారు విడాకులు ఇచ్చే సాంప్రదాయం మీ కులంలో లేదా మీ తెగలో గుర్తింపు కలిగి ఉండాలి.
- పరస్పర అంగీకారంతో మాత్రమే ఈ విధంగా విడాకులు ఇచ్చే వీలుంది.
- ఇరు వర్గాల వాదనలను విన్న తర్వాతనే పంచాయితీ వారు విడాకులు ప్రదానం చేయవచ్చు.
- ఒక వేళ ఏకపక్ష అంగీకారంతో విడాకులు ఇవ్వబడితే, బాధితులు వెంటనే కోర్టులో కేసు వేయవచ్చు.